http://www.agnidharanews.com

# అగ్నిధార

సోమవారం 29 డిసెంబర్ 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8   వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## త్వరలోనే భారత్ నుంచి మలేరియాను పూర్తిగా తొలగిస్తాం

- భారత్‌లో మలేరియా కేసులు 97 శాతం తగ్గాయి
- అతి త్వరలో దేశం నుంచి పూర్తిగా మలేరియాను తరిమేస్తాం
- ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైంది
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

# దుమ్ముదుమారమే!



- అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్..
- ముఖ్యమంత్రి రేవంత్ టీమ్ రెడీ..
- తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి..
- నదీ జలాల పంపిణీ, పాలమూరు ప్రాజెక్ట్‌లపై చర్చ జరిగే అవకాశం ఉంది..
- అయితే.. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభానికి ముందే హాట్‌టాపిక్‌గా మారాయి..

హైదరాబాద్:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం (డిసెంబర్ 29 2025) నుంచి ప్రారంభం కాబోతున్నాయి.. అయితే.. ప్రారంభానికి ముందే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్‌టాపిక్‌గా మారుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారనే ప్రచారం.. అయితే.. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా?.. లేదా?.. అనేది తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఇటీవల బీఆర్ఎస్ నేతలతో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్.. ఆ తర్వాత.. ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. నదీ జలాల పంపిణీ, పాలమూరు ప్రాజెక్ట్‌ల విషయంలో రేవంత్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాలమూరు-రంగారెడ్డి - మిగతా3లో



## అసెంబ్లీని కనీసం 15 రోజులు నడిపించాలి

- కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు డిమాండ్
- బీఆర్ఎస్ హయాంలో ఎక్కువ రోజులు సమావేశాలు నడిపించాం
- రెండేళ్లలో ఓవరాల్‌గా రేపటికి 40 రోజులు జరిపింది
- సభ నడపాలంటే కాంగ్రెస్ జంకుతుంది
- మేం లేవనెత్తిన ఒక్క అంశం మీద కూడా చర్చ పెట్టట్లేదు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే ప్రతిపక్షం బాధ్యత

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కువ రోజులు సమావేశాలు నడిపించామని గుర్తుచేశారు. దాదాపు ఒక సెషన్ 32 రోజులు నడిపించామని తెలిపారు. కాంగ్రెస్ మొత్తంగా 16 రోజులు నడిపించిందని పేర్కొన్నారు. రెండేళ్లలో ఓవరాల్‌గా రేపటికి 40 రోజులు జరిపిందని చెప్పారు. సభ - మిగతా3లో



## దేశానికి గర్వకారణం 2025

- ఈ సంవత్సరం దేశానికి అమితమైన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది
- ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకునే ఎన్నో ఘట్టాలు ఈ ఏడాదిలో చోటుచేసుకున్నాయి
- దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, ప్రపంచంలో తన స్థానాన్ని మరింత ఉన్నతంగా నిలబెట్టుకున్నది
- 'మన కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

## మోదీ పాలనతో ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం

- సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు
- మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తోంది
- 'కాంగ్రెస్ ఏర్పాటయ్యాక, ద్వేష స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాటం చేశాం
- స్వతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు, మరెన్నో బలిదానాలు జరిగాయి.
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే





## సబ్‌మెరైన్‌లో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# స్కూల్‌కు రారు అటెండెన్స్ మాత్రం ఫుల్

## జీ-2 పద్ధతిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి
- పట్టణ ప్రజల అవసరాలు, డ్రైనేజీ ఇతర ఏ సేవలకైనా మాకోసం ఒక కార్యాలయం ఉంది
- సిబ్బంది ఉన్నారు అన్న భావన కల్పించేందుకు ఈ భవనానికి శంకుస్థాపన
- ఒకపక్క ఏరు.. మరోపక్క చెరువుతో మధిర పట్టణం విస్తరణ సమస్యను ఎదుర్కొంటోంది
- ప్రజలు మాత్రం మధిరలో నివసించేందుకు పోటీ పడుతున్నారు

మధిర

స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు గొప్ప చరిత్ర కలిగిన పట్టణం మధిర.. ఈ పట్టణంలో అభివృద్ధిని ఉరకలు పెట్టిస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర పురపాలక కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం ఏర్పాటు - మిగతా3లో





## భారత్ దెబ్బకు పాక్ సైనికులు వణికిపోయారు

- అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు
- ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌పై భారత్ దాడులు చేసింది.
- భారత్ దెబ్బకు పాకిస్తాన్ సైన్యం బంకర్లల్లో దాక్కున్నారు
- ప్రాణాలు కాపాడుకునేందుకు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు
- నన్ను కూడా బంకర్లలో దాక్కోవాలని సలహా ఇచ్చారు
- కానీ, నేను అలా చేయలేదు అంటూ కామెంట్స్



- అనధికారికంగా టీచర్ల గైర్హాజరు
- ప్రతిరోజూ విధులకు అనధికారికంగా ఐదారు వేల మంది టీచర్ల గైర్హాజరు
- ముఖ గుర్తింపు హాజరు అమల్లోకి వచ్చినా మారని తీరు
- షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్న సంబంధిత డీఈవోలు

హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ ముఖ గుర్తింపు హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్) అమలు చేస్తున్నా, పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరు మాత్రం తగ్గడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సెలవు పెట్టకుండా, అనధికారికంగా గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులు ఏకంగా వేలల్లో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. సమగ్ర శిక్ష అధికారుల లెక్కల ప్రకారం సగటున ప్రతి రోజూ 5 నుంచి 6 వేల మంది వరకు ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయడం లేదు. ఒక్కో రోజు ఆ సంఖ్య తొమ్మిది వేలకు మించుతుండటంతో ఉన్నతాధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ వర్గాలు మాత్రం ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో టెక్నికల్ - మిగతా3లో

# దేశానికి గర్వకారణం 2025

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది(2025)లో చివరిదైన తన రేడియో కార్యక్రమం 'మన కీ బాత్'లో ప్రసంగించారు. 2025 భారత్‌కు గర్వకారణంగా నిలిచిన ఏడాదిగా అభివర్ణించారు. ఈ సంవత్సరం దేశానికి అమితమైన ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని పేర్కొన్న ఆయన.. ప్రతి భారతీయుడు గర్వంగా తలెత్తుకునే ఎన్నో ఘట్టాలు ఈ ఏడాదిలో చోటుచేసుకున్నాయన్నారు. దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, ప్రపంచంలో తన స్థానాన్ని మరింత ఉన్నతంగా నిలబెట్టుకున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఆపరేషన్ సిందూర్'ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది దేశ భద్రతకు సంబంధించి ఒక కీలకమైన మలుపుగా నిలిచిందని, భారత్ తన భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడదనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఆపరేషన్ అందించిందని అన్నారు. ఈ విజయంతో దేశ ప్రజల్లో భారత సైన్యం సామర్థ్యంపై నమ్మకం మరింత బలపడిందని అన్నారు. క్రీడారంగంలో భారత్ సాధించిన విజయాలను గుర్తు చేసిన ప్రధాని.. 2025 భారత క్రీడా చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన సంవత్సరం అని అన్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకోవడం,



మహిళల క్రికెట్ జట్టు వన్డే వరల్డ్ కప్‌ను తొలిసారిగా సాధించడం దేశానికి అమితమైన ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పారా అథ్లెట్లు కూడా అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి, దేశ ప్రతిష్ఠను పెంచారని ప్రధాని పేర్కొన్నారు. విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోనూ భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని, అంతరిక్ష పరిశోధనల్లో భారత శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయన్నారు. భారత అంతరిక్షయాత్రికుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లడం దేశానికి గర్వకారణమని అన్నారు. సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా కూడా 2025 విశేషమైన సంవత్సరమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన వేడుకలు జాతీయ ఐక్యతను ప్రతిబింబించాయన్నారు. మహా కుంభమేళా ప్రపంచాన్ని ఆకర్షించే స్థాయిలో విజయవంతంగా జరిగిందన్నారు. అయోధ్యలో రామమందిరానికి సంబంధించిన ఘట్టాలు కోట్లాది మంది హృదయాల్లో భావోద్వేగాలను రేకెత్తించాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పర్యావరణ సంరక్షణ విషయంలోనూ భారత్ ముందడుగు వేసిందని, జంతు సంరక్షణ చర్యలతో చిరుతపులుల సంఖ్య పెరగడం దేశం సాధించిన విజయాలకు ఉదాహరణలని ప్రధాని అన్నారు. ప్రసంగం ముగింపులో ప్రధాని మోదీ.. 2025 భారత్‌కు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిన సంవత్సరం అని పునరుద్ఘాటించారు. ఈ విశ్వాసంతోనే దేశం 2026లోకి అడుగుపెడుతున్నదని, కొత్త ఆశలు, కొత్త సంకల్పాలతో భారత్ ముందుకు సాగుతున్నదని అన్నారు. ప్రతి పౌరుడు దేశ అభివృద్ధిలో భాగస్వామిగా మారాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# మోదీ పాలనతో ప్రమాదంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం

**ఢిల్లీ:** కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకుందని వ్యాఖ్యానించారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తోంది అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. అనంతరం, మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ..'కాంగ్రెస్ ఏర్పాటయ్యాక, ద్వేష స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాటం చేశాం. స్వతంత్ర పోరాటంలో ఎన్నో త్యాగాలు, మరెన్నో బలిదానాలు జరిగాయి. దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చుకున్నాం. స్వాతంత్ర పోరాటాన్ని మహాత్మా గాంధీ ముందుండి నడిపించారు. ఆయన నేతృత్వంలో రైతులు, కూలీలు, మహిళలు కలిసి



వచ్చారు. ప్రస్తుతం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయి. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకుంది. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశ స్వరూపాన్ని మార్చింది. ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకొని దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ పని చేసింది. సమాజాన్ని ముందుకు నడపడమే కాంగ్రెస్ ఆలోచన. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ తీసుకువచ్చిన సంస్కరణలను తక్కువ చేస్తుంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రజల గురించి ఆలోచించడం లేదు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. ప్రజల హక్కులను నాశనం చేస్తున్నారు. కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో ఒడిదొడుకులను చూసింది. దేశ ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పని చేస్తూనే ఉంటుంది. ప్రజా వ్యతిరేక విధానాలపై బలంగా సమాధానం ఇవ్వాలి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా భవన్ కేంద్ర బిందువు కానుంది. ప్రజాస్వామ్యం కాపాడేందుకు అందరూ కలిసి రావాలి, పెద్ద ఎత్తున పోరాటం జరగాలి. కాంగ్రెస్ కథమైంది అంటున్నారు, మా దగ్గర అధికారం లేకపోవచ్చు. కానీ, ఆలోచనలు ఆకాంక్షలు అలాగే ఉన్నాయి. కాంగ్రెస్ ధర్మం పేరుతో ఓటు అడగలేదు. కాంగ్రెస్ పోరాటం చేయకుంటే రాజ్యాంగాన్ని ఎవరు రక్షిస్తారు అని వ్యాఖ్యలు చేశారు.

# పెళ్లయిన 10 నెలలలోపే బిడ్డను కంటే భారీగా జరిమానా

నాగరికత పేరుతో నగరాల్లో సహజీవనం చేయడం, వివాహానికి ముందే గర్భం దాల్చడం, ప్రేమ పెళ్లిళ్లు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇలాంటి వ్యవహారాలను తమ గ్రామంలోకి అడుగుపెట్టకుండా చేసేందుకు చైనాలోని యునాన్ రాష్ట్రం లిన్‌కాంగ్ జిల్లాలోగల ఓ గ్రామస్థులు కఠినమైన నిబంధనలు పెట్టుకున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు ఓ తీర్మానం చేశారు. ఆ నిబంధనల ప్రకారం.. గ్రామంలో ఎవరైనా వివాహం కాకుండా కలిసి ఉంటే ఏటా 500 యువాన్లు (సుమారు రూ.6 వేలు) జరిమానాగా చెల్లించాలి. అదేవిధంగా పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి 3,000 యువాన్లు (రూ.38,472) పంచాయతీకి కట్టాలి. పెళ్లయిన తర్వాత 10 నెలల లోపే బిడ్డను కంటే కూడా అంతే మొత్తం ఫైన్ చెల్లించాలి. అదేవిధంగా ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే 1,500 యువాన్లు (సుమారు రూ.19 వేలు), దంపతులు గొడవపడి గ్రామ పెద్దల వద్దకు వస్తే ఇద్దరూ చెరో 500 యువాన్లు (సుమారు రూ.6 వేలు), మద్యం సేవించి గ్రామంలో గొడవ చేస్తే 3 వేల నుంచి 5 వేల యువాన్లు (రూ.38,472 నుంచి రూ.64,120), నిరాధార ఆరోపణలు, పుకార్లు సృష్టిస్తే 500



నుంచి 1,000 యువాన్లు (రూ.6,412 నుంచి రూ.12,824) జరిమానా చెల్లించాలని పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఓ బోర్డును తయారు చేసి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటుచేశారు. సంప్రదాయ కుటుంబ విలువలు, నైతికతను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నియమాలు అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. అయితే అందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెంటనే ఆ బోర్డును తొలగించారు.

# భారత్ దెబ్బకు పాక్ సైనికులు వణికిపోయారు

**ఇస్లామాబాద్:** దాయాది దేశం పాకిస్తాన్ అసలు రంగు బయట పడింది. లోన లొటారం పైన పటారం అన్న చందంగా ఇన్ని రోజులు ఆపరేషన్ సిందూర్‌పై పాక్ నేతలు చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా బొక్కబోర్లాపడ్డారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ సైన్యం బంకర్లలో దాక్కున్నారని ఏకంగా ఆ దేశ అధ్యక్షుడే ఒప్పుకోవడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తాజాగా ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌పై భారత్ దాడులు చేసింది. ఈ సందర్భంగా భారత్ దెబ్బకు పాకిస్తాన్ సైన్యం బంకర్లలో దాక్కున్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు. నన్ను కూడా బంకర్లలో దాక్కోవాలని సలహా ఇచ్చారు. కానీ, నేను అలా చేయలేదు అంటూ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ దాడులపై పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్, ఆసిమ్ మునీర్ ఓవరాక్షన్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌ను పాక్ సైన్యం ధీటుగా ఎదుర్కొందని భారత్ యుద్ధ విమానాలనే కూల్చివేసినట్టు వ్యాఖ్యలు చేశారు. ఇక, తాజాగా జర్దారీ వ్యాఖ్యలతో పాక్ నేతలు, అధికారుల గాలి తీసినట్టు అయ్యింది. కాగా, పాకిస్తాన్ ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమవుతోంది. ఆపై అధ్యక్షుడు జర్దారీ చేసిన ఈ ప్రకటన పాకిస్తాన్ బలహీనమైన స్థితిని హైలైట్ చేస్తుంది. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అప్పులతో సతమతమవుతున్న పాకిస్తాన్‌కు పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక సైనిక సంసిద్ధతకు సామర్థ్యం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో, పాకిస్తాన్ సైన్యం బంకర్లలో దాక్కోవడం దాని అంతర్గత అభద్రతా భావాన్ని, ఒత్తిడిని బహిర్గతం చేసింది.



**భారత్ దాడులు..**

ఇదిలా ఉండగా.. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి మరీ దాడి చేయడంతో పెద్ద సంఖ్యలో ముష్కరులు హతమయ్యారు. ఉగ్రవాద స్థావరాలు, శిక్షణా కేంద్రాలు నేలమట్టమయ్యాయి. పాక్ వైమానిక కేంద్రాలు, యుద్ధ విమానాలు సైతం ధ్వంసమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌తో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదని సాక్షాత్తూ పాకిస్తాన్ సైన్యమే చెబుతోంది. భారత సైన్యం సత్తా ఏమిటో పొరుగు దేశానికి తెలిసొచ్చింది. దాంతో ముందు జాగ్రత్త చర్యగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దు అయిన నియంత్రణ రేఖ(ఎల్ఓసీ) వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. కీలక ప్రాంతాల్లో కౌంటర్%-%డ్రోన్ వ్యవస్థలను మోహరించింది. మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడితే సిందూర్ మళ్లీ ప్రారంభమవుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది. అందుకే ఆపరేషన్ సిందూర్ 2.0 భయం పాకిస్తాన్‌ను వెంటాడుతోంది.

## త్వరలోనే భారత్ నుంచి మలేరియాను పూర్తిగా తొలగిస్తాం




భారత్ నుంచి మలేరియాను త్వరలోనే పూర్తిగా తొలగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. నేడు అహ్మదాబాద్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. భారత్‌లో మలేరియా కేసులు 97 శాతం తగ్గాయని, అతి త్వరలో దేశం నుంచి పూర్తిగా మలేరియాను తరిమేస్తామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన చెప్పారు. వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యవంతమైన ప్రజలు అవసరమని, అందుకు డాక్టర్లు.. ప్రభుత్వ పథకాల లక్ష్యం నెరవేరేలా కలిసి పనిచేయాలని కోరారు. భారత్ ఆరోగ్య రంగంలో తీసుకుంటున్న చర్యలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దేశంలో గడిచిన ఐదేళ్లలోనే డెంగ్యూ మరణాల రేటును 1 శాతం, ప్రసూతి మరణాల సంఖ్య 25 శాతం తగ్గిందని షా వెల్లడించారు. 2014లో రూ.37 వేల కోట్లుగా ఉన్న కేంద్ర ఆరోగ్య బడ్జెట్ ఇప్పుడు రూ.1.28 లక్షల కోట్లకు పెరగడమే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు.

## సబ్‌మెరైన్‌లో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరం నుంచి కల్వరి శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ లో బయలుదేరారు. రాష్ట్రపతి వెంట నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఉన్నారు. కల్వరి క్లాస్ జలాంతర్గామిలో రాష్ట్రపతి ముర్ము ప్రయాణించడం ఇదే తొలిసారి. గతంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కల్వరి శ్రేణి సబ్‌మెరైన్‌లో ప్రయాణించారు. ఆ తర్వాత సబ్‌మెరైన్‌లో ప్రయాణిస్తున్న రెండో రాష్ట్రపతిగా ముర్ము గుర్తింపు పొందారు.

## జమ్మూలో 30 మంది పాకిస్థాన్ ఉగ్రవాదులు.. అప్రమత్తమైన భద్రతాబలగాలు..!



జమ్మూ ఏరియా లో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. దాంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో మంచు కురుస్తుండటంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విషయాన్ని సరిహద్దు భద్రతా దళం అధికారులు వెల్లడించారు. అయితే ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నాయని అన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించినట్లు తెలిపారు.

## కొత్త పెళ్లి జోష్.. పార్టీ మత్తు నదిలో దూకుడు

**తిరువొత్తియూరు:** కన్యాకుమారి జిల్లా కలియక్కావిలై దగ్గరలోని మెదుగుమ్మల్ ప్రాంతానికి చెందిన ఇవాంజెరీ (28), లాయర్ అయిన ఇతనిపై పలు కొట్లాట కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నెల క్రితం సాహినియా (25) అనే లాయర్‌ను ప్రేమించి



పెళ్లి చేసుకున్నాడు. కొత్త వరుడు ఇవాంజెరీ, ఈ సంవత్సరం క్రిస్మస్ పండుగను స్నేహితులతో కలిసి ఉత్సాహంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం 24వ తేదీన స్నేహితులతో కుళిత్తురైలోని ఓ ప్రైవేట్ మద్యం బార్‌కు వెళ్లి మద్యం విందులో పాల్గొన్నారు. అక్కడ అందరూ ఉత్సాహంగా మద్యం తాగారు. దీంతో మత్తులో ఉన్న ఇవాంజెరి మద్యం బార్ వెనుకకు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న అతను అకస్మాత్తుగా తామ్రపరణి నదిలోకి దూకాడు. తర్వాత నీటిలో కొట్టుకుపోయాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన స్నేహితులు ఈ విషయాన్ని అగ్నిమాపక కేంద్రానికి తెలియజేశారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఓ ప్రాంతంలో అతడి మృతదేహాన్ని గుర్తించారు.

# ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**లేకపోతే ఆర్టీవో కార్యాలయాల ముట్టడి**

**ఆటో జేఏసీ రాష్ట్ర నాయకుల హెచ్చరిక**




**అగ్ని ధార న్యూస్,( రామగుండం)** ప్రస్తుతం జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ హైదర్‌గూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే దస్తగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగుడాల సాయిలు మాట్లాడుతూ "ప్రభుత్వాలు ఉపాధి చూపకపోయినా, ఆటోలు నడుపుకుంటూ కాళ్ల మీద నిలబడి బతుకుతున్న మాకు నోటికాడి కూడును కూడా గుంజేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఈ అన్యాయాన్ని మేము సహించబోం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిధిలో సుమారు 45 వేల ఆటోలకు పర్మిట్లు జారీ చేయడం ద్వారా అవినీతికి, బ్రోకర్ల దందాకు తెరలేపారని, దీనిని వెంటనే రద్దు చేసి అర్హులైన ఆటో డ్రైవర్లకే పర్మిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆర్టీవో కార్యాలయాలను ముట్టడిస్తామని స్పష్టం చేశారు..ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు జీవన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఆటో డ్రైవర్ల సమస్యలపై స్పందించలేదని విమర్శించారు. మహిళలకు ఆర్టీసీ ఫ్రీ ప్రయాణం అమలు చేయడంతో ఆటోల్లో మహిళా ప్రయాణికులు తగ్గిపోయి, ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి అప్పుల పాలయ్యారని తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు వందకు పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు, అలాగే ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ చాలా తీవ్రంగా ఉంటుందని ఆటో జేఏసీ నాయకులు హెచ్చరించారు.

# ఖాళీ కుర్చీ” సందేశం

**వాగ్దాన భంగంపై ప్రశ్నించే హక్కు ప్రజలది**

**మేధా సంపత్తి తెలంగాణ కవుల సొంతం -సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.**



రచయిత రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.



ఖాళీ కుర్చీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

**అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా:** గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన "ఖాళీ కుర్చీ" కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం వనపర్తి పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, గంగవరం రామకృష్ణారెడ్డి సరళమైన భాషలో సున్నితమైన సామాజిక అంశాలను స్పృశిస్తూ "ఖాళీ కుర్చీ" కవితా సంపుటిని రచించడం అభినందనీయమని అన్నారు. వాగ్దానాల భంగానికి, అధికార ధర్మానికి కుర్చీ మౌన సాక్షిగా నిలుస్తుందని, సామూహిక బాధ్యతలను నెరవేర్చడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు.కవితా సంపుటి పరిమాణంలో చిన్నదైనా, అందులోని నిగూఢార్థం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తుందని అన్నారు. దాశరథి రచించిన "ఆ చల్లని సముద్ర గర్భం" గేయాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ప్రకృతిలోని అనేక శాస్త్రాలను స్పృశించిన ఆ గేయం వర్ధమాన యువ కవులకు ఆదర్శంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. "ఖాళీ కుర్చీ" కవిత వాగ్దానాల భంగం వల్ల సమాజానికి కలిగే ప్రమాదాన్ని బలంగా తెలియజేస్తుందని, ఇది మంచి సామాజిక సందేశమని కొనియాడారు. గంగవరం రామకృష్ణారెడ్డి మంచి రచయితగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సభ సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస. శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, డాక్టర్ వీరయ్య, నారాయణరెడ్డి, డాక్టర్ సురేష్ విశ్వ, నాయకంటి నరసింహ శర్మ, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, రెడ్డి సేవా సమితి నారాయణరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎండి సత్తార్, కిరణ్, కంటే నిరంజన్ అయ్యా, బుచ్చిబాబు, బుచ్చయ్య నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, సూగురు మురళీ సాగర్, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, మంద రాము, కళావతి,సుగుణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్‌కు రారు - అటెండెన్స్ మాత్రం ఫుల్

-మొదటిపేజీ తరువాయి

సమస్యలు, అవగాహన లేమి కారణంగా గైర్హాజరు సంఖ్య అధికంగా కనిపిస్తోందని చెబుతున్నాయి.

**అనేక ఐచ్ఛికాలు ఉన్నా :**

రాష్ట్రంలో ఆగస్టు నుంచి ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రెకగ్నిషన్ సిస్టమ్) వ్యవస్థ అమలవుతోంది. ఇందులో భాగంగా టీచర్లు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చి మొబైల్ ఫోన్‌లోని ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలి.

ఒకవేళ ఇతర అధికార పనులపై హాజరుకాని పక్షంలో ఆన్ డ్యూటీ అని, డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలల్లో పని చేస్తుంటే డిప్యుటేషన్ అని, సెలవు పెట్టిన పక్షంలో సెలవు అని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అసలు ఇలాంటివేమీ లేకుండానే వేల మంది గైర్హాజరవుతున్నారు.

ఉన్నతాధికారులు డిసెంబర్ 22న ఎఫ్ఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా 9,031 మంది అనధికారికంగా గైర్హాజరైన సమాచారాన్ని గుర్తించారు. 'వారంతా ఎఫ్ఆర్ఎస్‌లో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. ఎఫ్ఆర్ఎస్ ప్రారంభమై ఐదు నెలలవుతోంది. రెండు, మూడు నెలల పాటు సాంకేతిక సమస్యలు, అవగాహన లేమి వంటి కారణాలు ఉంటాయనే ఉద్దేశంతో ఈ విషయం గురించి ఎవరినీ ప్రశ్నించలేదు. దీన్ని ఆసరాగా తీసుకునే అనేక మంది విధులకు గైర్హాజరవుతున్నట్లు భావిస్తున్నాం' అని విద్యాశాఖకు చెందిన కొంతమంది అధికారులు చెబుతున్నారు.

దీనిపై ఉపాధ్యాయ వర్గాలు మాత్రం భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. 'ఎఫ్ఆర్ఎస్‌లో సాంకేతిక సమస్యలతో యాప్‌లో అటెండెన్స్ నమోదు కావడం లేదు. అందుకే వేలల్లో గైర్హాజరైనట్లు కనిపిస్తోంది. ఉదాహరణకు టీచర్లు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్లిన సందర్భాల్లో తాము విధుల్లో



ఉన్నామనే భావనతో ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్‌ను నమోదు చేయడం లేదు' అని గెజిటెడ్ హెచ్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ గంగారెడ్డి చెప్పారు.

ఒకే జిల్లాలో 1,250 మందికి షోకాజ్ నోటీసులు : కామారెడ్డి జిల్లాలో కలెక్టర్, డీఈవో (జిల్లా విద్యా అధికారి) ఉపాధ్యాయుల గైర్హాజరు అంశంపై దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా అనధికారికంగా గైర్హాజరైన 1,250 మందికి ఒకేసారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్‌లో వివరాలేవీ నమోదు చేయడం లేదంటే అనధికారికంగా గైర్హాజరైనట్లే భావిస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి ప్రతిరోజూ జిల్లాల వారీగా గైర్హాజరైన వారి జాబితా డీఈవోలకు పంపించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అంశాల గురించి విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఆ జాబితా ప్రకారం డీఈవోలు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారని తెలిపారు.

**హాజరు కాకపోతే ఉద్యోగం ఊస్టింగే**

వరుసగా నెలరోజుల పాటు అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేసి, ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని గతంలో జరిగిన సమీక్షలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డీఈవోలకు సూచించారు. వాస్తవానికి ఒక రోజు అనధికారికంగా పాఠశాలకు రాకున్నా చర్యలు తీసుకోవచ్చని, కాకపోతే అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడ్డానని, రోడ్డు ప్రమాదానికి గురయ్యానని ఇలా ఏదో ఒక సాకు చూపి కోర్టుల్లో కేసులు వేస్తారన్న అంశాలు ఇక్కడ ఉత్పన్నమయ్యాయి. దాంతో ప్రస్తుతానికైతే షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 50 మంది ప్రభుత్వ టీచర్లను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించామని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కొందరు కనీసం సెలవులను పొడిగించుకుంటామని ఏమాత్రం సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఉద్యోగం నుంచి తొలగించే చర్యలు చేపట్టే అవకాశాలూ ఉన్నాయి.

## అసెంబ్లీని కనీసం 15 రోజులు నడిపించాలి

-మొదటిపేజీ తరువాయి



నడపాలంటే కాంగ్రెస్ జంకుతుందని అన్నారు. శాసన సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదని హరీశ్‌రావు అన్నారు. ఎమ్మెల్యేల సంతాపాలు, ఘోష్ కమిషన్ విషయాల మీదే సభ నడిపారని తెలిపారు. మేం లేవనెత్తిన ఒక్క అంశం మీద కూడా చర్చ పెట్టట్లేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే ప్రతిపక్షం బాధ్యత అని స్పష్టం చేశారు. అధికార బలంతో ప్రతిపక్షాలను అణగదొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. మందబలం ప్రదర్శించి సభను భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కేసీఆర్ మాట్లాడిన అంశాలను.. మాపై మళ్లీ బురద జల్లడానికి అసెంబ్లీని నడుపుతున్నారని విమర్శించారు. 45 టీఎంసీలకు మీరు సంతకం పెట్టారా లేదా సూటిగా చెప్పండని ప్రశ్నించారు. 45 టీఎంసీలకు ఒప్పుకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 45 టీఎంసీలతో రంగారెడ్డిని ఎండబెడుతారా అని నిలదీశారు. డీపీఆర్ వాపస్ వచ్చిందా లేదా? ఆ సంతకం మీదా కాదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీని 45 రోజులు నడపాలని ఆరోజు కాంగ్రెస్ నాయకులు అన్నారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రశ్నించే హక్కు అని.. గొంతు నొక్కుతున్నారని అని ఆనాడు అన్నారని తెలిపారు. ఇప్పుడు మేం అడుగుతున్నాం.. సభను 15 రోజులు కచ్చితంగా నడపాలన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలాగా కాకుండా మేం ప్రిపేర్ అయ్యి సభకు వస్తామని తెలిపారు. గతంలో కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మాట్లాడుతుంటే ఉత్తమ్ మేం ప్రిపేర్ అయ్యి రాలదేని అన్నాడని విమర్శించారు. నేను ఘోష్ కమిషన్ మీద మాట్లాడుతుంటే ఏడుగురు మంత్రులు అడ్డుపడ్డారని తెలిపారు. మంత్రులకు సమాధానం చెప్పాలా? సబ్జెక్ట్ మాట్లాడాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సభా సంప్రదాయాలను తుంగలో తొక్కిందని అన్నారు. సబ్జెక్ట్ మాట్లాడినంత సమయం ఇవ్వాలని .. మైక్ కట్ చేయవద్దని డిమాండ్ చేశారు. హౌస్ కమిటీలు ఇప్పటికీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు విఫలమయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో పీఏసీ కమిటీ ఎలా వేశారో శ్రీధర్‌బాబుకు తెలుసు కదా అని అన్నారు. శాసనసభకు మొత్తం 18 కమిటీలు ఉంటాయని తెలిపారు. కానీ ఒక్క కమిటీ కూడా వేయలేదని చెప్పారు. బ్యాక్ డోర్ నుంచి నామినేషన్ వేయించి ఆమోదించారని మండిపడ్డారు. అసెంబ్లీలో ఎరువుల కొరతపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిగా చేయనందుకు చర్చ జరగాలని అన్నారు. రైతుబంధు రెండు పంటలకు ఎగ్గొట్టినందుకు చర్చ జరగాలన్నారు. హిల్ట్ పాలసీపై 5 లక్షల కోట్ల కుంభకోణం మీద చర్చ జరగాలన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌పై చర్చ జరగాలని పట్టుబట్టారు. ట్రిపుల్‌ఆర్, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల పీఆర్సీ, డీఏలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ, హైడ్రా బుల్డోజర్‌పై చర్చ జరగాలన్నారు.

కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు 299 టీఎంసీల కోటాకు ఒప్పుకున్నది గత కాంగ్రెస్ ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు. ఆధారాలతో సహా కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపుతామని అన్నారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం కాదు.. ప్రశ్నించే గొంతులను నొక్కే పాలన అని మండిపడ్డారు. 299 టీఎంసీలను వ్యతిరేకిస్తూ అపెక్స్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ ప్రభుత్వం 32 లేఖలు రాసిందని గుర్తుచేశారు. కృష్ణా జలాలను తిరిగి రాష్ట్రాలకు పంచితేనే న్యాయం జరుగుతుందని అన్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చిల్లర, చిచోరా భాష మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. హుందా అనే పదం పలికే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు.

## జీ-2 పద్ధతిలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

-మొదటిపేజీ తరువాయి

చేసిన సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగాన్ని కాపాడడానికి 86 మందితో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏర్పడిన అద్భుతమైన రోజు డిసెంబర్ 28 అని తెలిపారు. మధిర పట్టణ ప్రజల అవసరాలు, డ్రైనేజీ ఇతర ఏ సేవలకైనా మాకోసం ఒక కార్యాలయం ఉంది, సిబ్బంది ఉన్నారు అన్న భావన కల్పించేందుకు ఈ భవనానికి శంకుస్థాపన చేస్తున్నట్టు తెలిపారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన నాయకులు పుట్టిన చరిత్రాత్మక నగరం మధిర అన్నారు. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరించకుండా నిజాం ప్రభుత్వం నిషేధం విధిస్తే సర్దార్ జమలాపురం కేశవరావు సవాల్ విసిరి మారువేషంలో వచ్చి మధిర నడిబొడ్డున మూడు రంగుల జెండా ఎగురవేశారని, అది స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిందని గుర్తు చేశారు.

ఒకపక్క ఏరు.. మరోపక్క చెరువుతో మధిర పట్టణం విస్తరణ సమస్యను ఎదుర్కొంటోందని, ప్రజలు మాత్రం మధిరలో నివసించేందుకు పోటీ పడుతున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం, భూ సేకరణకు నిధులు కూడా కేటాయించామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోతే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం.. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు ఉంటాయని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వర్షం రాగానే కరెంటు స్తంభాలపై చెట్లు పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.. ఈ సమస్యను పరిష్కరించేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్టే మధిర పట్టణంలోని పేదలు నివసించడానికి %+%౦2 టవర్స్‌తో హౌసింగ్ కాలనీ నిర్మించబోతున్నాం, త్వరలోనే ఈ కార్యక్రమానికి భూమి పూజ చేస్తానని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర పట్టణం మన అందరిదీ.. పట్టణానికి సమీపంలో అమరావతి నగరం, బందరు పోర్టు, రైల్వే లైన్ ఉండటంతో వస్తువులన్నిటినీ సులభంగా రవాణా చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

## ఒకటి రెండు రోజులు అసెంబ్లీ పెడతామంటే ఒప్పుకునేది లేదు : బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద



రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతుందని.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద స్పష్టం చేశారు. ప్రెస్ మీట్‌లో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు 420 హామీలపై ప్రభుత్వ దాటవేత ధోరణిని ప్రశ్నిస్తామన్నారు. గురుకులాల అసమర్థ నిర్వహణను, విద్యార్థుల మరణాలను ప్రస్తావిస్తాం.. ఎవరిని సంప్రదించకుండా జీహెచ్ఎంసీలో 22 మున్సిపాలిటీలను అశాస్త్రీయంగా ఆర్డినెన్స్ తెచ్చి విలీనం చేయడాన్ని గట్టిగా నిలదీస్తామన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వైఖరిని ఎండగడుతాం.. రైతులకు బోనస్ బోగస్ అయిన అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. యూరియా కొరతపై రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతాం. మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్‌కు సింగరేణి సంస్థ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. తూతూ మంత్రంగా ఒకటి రెండు రోజులు అసెంబ్లీ పెడతామంటే ఒప్పుకునేది లేదు . ప్రజా సమస్యలన్నీ చర్చించేదాకా అసెంబ్లీ సమావేశాలు పెట్టాల్సిందేనన్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్ కు సీఎం సహా కాంగ్రెస్ నేతలు గజ గజ వణికి పోతున్నారు .అందుకే పిచ్చి కూతలు కూస్తున్నారుజ పదేళ్ల కేసీఆర్ పాలనపై కూడా అసెంబ్లీలో మేము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# మాజీ మంత్రి ఆరోపణలు విడ్డూరం

## అసత్య ప్రచారాలు మానుకోవాలి : ఐఎన్‌టీయూసీ



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణి భవన్‌కు నిన్న వచ్చిన మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అటు ప్రభుత్వంపై, ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అసత్య ఆరోపణలతో నిండి ఉన్నాయని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం హైదరాబాద్‌లో ఒక ప్రెస్ స్టేట్‌మెంట్ విడుదల చేశారు. మీ పదేళ్ల పాలనలోనే పార్లమెంట్‌లో మీ పార్టీ ఎంపీలు సింగరేణిని ప్రైవేటీకరించే కుట్రకు మద్దతుగా బిల్లుకు ఆమోదం తెలిపిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసునని జనక్ ప్రసాద్ గుర్తుచేశారు. మీరు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సింగరేణి నిధులను ఇష్టారాజ్యంగా వినియోగించి, సంస్థపై సుమారు రూ.30 వేల కోట్ల బకాయిలు మోపిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. సింగరేణి నిధులను సిద్ధిపేటకు తరలించి, ఆ డబ్బులతో అక్కడ స్టేడియం నిర్మించినది మీ హయాంలోనే జరిగిందని ఆరోపించారు.మీ పాలనలోనే మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ, కార్మికుల పిల్లలకు కనీస స్థాయిలో మెడికల్ సీట్లు కేటాయించలేకపోయిన వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు మీకు లేదని కార్మిక వర్గం భావిస్తోందని జనక్ ప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా కల్పించిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎన్నడూ లేనివిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,000 వేతన పెంపు, ఈ ఏడాది రూ.5,500 బోనస్ పెంపు చేసిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదేనని తెలిపారు.మీ పాలనలో సింగరేణికి కొత్త బొగ్గు గనులు రాకుండా కుట్రలు చేసి, సంస్థ అస్తిత్వాన్నే దెబ్బతీసి, ఆర్థికంగా బలహీనపరిచారని ఆరోపించారు. ఇప్పుడు అకస్మాత్తుగా సింగరేణిపై ప్రేమ చూపించినా, కార్మికులు గానీ, ప్రజలు గానీ నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో సింగరేణి సంస్థను బలపరుస్తూ, కార్మికుల హక్కులను కాపాడుతున్న ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలని జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మీ పాలనలో చేసిన తప్పులకు ముందుగా సమాధానం చెప్పాలని ఆయన స్పష్టం చేశారు.

# చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం జరిగింది

డెస్క్ జర్నలిస్టులందరికీ పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం.
బస్ పాస్ లతో సహా ఇతర అన్ని సంక్షేమ పథకాలు వారికి వర్తింపజేయిస్తాం.
అవాస్తవాలతో కొందరు తప్పుద్రోవ పట్టిస్తున్నారు.
-టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ






**అగ్నిధారన్యూస్ హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్ లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్ లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు.ఆదివారం బషీర్ బాగ్ లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ముఖ్యుల సమావేశానంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్ లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా నానాటికి జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జీవోను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని, అబద్దాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జర్నలిస్టులకు ఇచ్చిన అక్రిడేషన్ కార్డులు ఎంతవరకు పని చేశాయో, దానికి కారణం ఎవరన్నది ప్రతి జర్నలిస్ట్ కు తెలుసునన్నారు. జర్నలిస్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలే నేడు జర్నలిస్టులకు మేలు జరుగుతోందంటే ఓర్చుకోలేకనే రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేసే ఏ సంస్థలకైనా, ఏ సంఘాల కైనా టియుడబ్ల్యూజే మద్దతు ఉంటుందని, అయితే ఆ పోరాటం సహేతుకమైనది అయి ఉండాలన్నారు. 252 జీవో తో 13వేల అక్రిడేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. 1996 సంవత్సరానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, అప్పటి తమ సంఘం ప్రభుత్వంతో కొట్లాడి గ్రామీణ విలేకరులందరికీ మండలాల వారీగా అక్రెడిటేషన్లు ఇప్పించిన చరిత్ర తమకు ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రెడిటేషన్ లను 12వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుకుంటున్న మిత్రులు , పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే సంఖ్యలో అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చారన్న విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు. కార్డుల సంఖ్య ముఖ్యం కాదని, ఆ కార్డులతో ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసారో, వాటి కోసం ఎన్ని ఉద్యమాలు చేసారో చెబితే బాగుంటుందన్నారు. 252 జీవో తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొందించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. సమాచార శాఖ కమిషనర్ తో పాటు ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కే.శ్రీనివాస్, ది హిందూ పత్రిక పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, వి6 వెలుగు పత్రిక సీఈవో అంకం రవి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు కె.ఎన్.హరి తదితరులతో వేసిన కమిటీ రూపొందించిన నిబంధనల మేరకే 252 జీవో వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల నియమ నిబంధనలు రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సూచించిన సిఫార్సులను అప్పటి మీడియా అకాడమీ చైర్మన్ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రామచంద్ర మూర్తి కమిటీ సిఫార్సులకు భిన్నంగా తీసుకువచ్చిన 239 జీవో తో జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే అప్పటి మీడియా అకాడమీ చైర్మన్, ఆయన సంఘం ఎందుకు నోరెత్తలేదన్నారు. ఆ జీవోతో చిన్న మధ్య తరహా పత్రికలకు, ఉర్దూ పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దాదాపు 4500అక్రెడిటేషన్ కార్డులు తొగించబడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణకు చెందిన యాజమాన్యాలు స్థాపించిన రెండు ప్రధాన పత్రికలకు అక్రెడిటేషన్లను అడ్డుకున్నది ప్రస్తుతం ఆందోళన చేస్తున్న సంఘమేనని విరాహత్ ఆరోపించారు. ఆ విషయంలో ప్రెస్ కౌన్సిల్ ను ఆశ్రయించి, ఆ పత్రికలకు న్యాయం చేసిన ఘనత తమ సంఘనిదే అని ఆయన గుర్తుచేసారు. అయితే గతంలో రాష్ట్రంలో జారీచేసిన దాదాపు 3 వేల అక్రెడిటేషన్ కార్డులు జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో ఉన్నట్లు తమ సంఘానికి అందిన ఫిర్యాదుల్లో తేలిందన్నారు. అడ్డదారుల్లో అక్రెడిటేషన్లు పొందిన వారే జర్నలిస్టులుగా చలామణి అవుతూ, ఇసుక వ్యాపారులను, రైస్ మిల్లర్లను, బిల్డర్లను, ఇతర వ్యాపారులను బెదిరిస్తూ పోలీసులకు చిక్కారని, వారిపై కేసులు నమోదు కావడం జర్నలిజం విలువలను మంటగలిపిందన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ ఆందోళనకు దిగిన ఆ సంఘం రాష్ట్ర కీలక నాయకుని కుటుంబ సభ్యులు నలుగురు మీడియా ఏజెన్సీ పేరుతో అక్రిడేషన్ కార్డులు పొందారని, అదే సంఘానికి చెందిన మరో రాష్ట్ర నాయకుని కుమారుడు యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఓ గ్రామ సర్పంచ్ గా వ్యవహరిస్తున్నప్పటికీ, అతనికి జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు ఇవ్వడంపై తమ సంఘం ఆందోళన చేసి ఆ కార్డును రద్దు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో పనిచేసే బాయ్ కి కూడా ఓ పత్రికా బ్యూరో కార్డు అందించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పద్దతుల్లో అక్రెడిటేషన్ కార్డులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు, వాటికీ గౌరవం దక్కించే ఉద్దేశంతోనే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో 252 జీవో ను తెచ్చారని ఆయన పేర్కొన్నారు. అక్రెడిటేషన్ కార్డులతో రిపోర్టర్లకు, డెస్క్ జర్నలిస్టులకు ఇంతకాలం ఏలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం ఇప్పుడైనా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి, అక్రెడిటేషన్, మీడియా కార్డులు పొందే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 252 జిఓ లో ఉన్న కొన్ని లోటు పాట్లను తాము గుర్తించామని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఏది ఏమైనా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు, మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ సంఘం సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జీవో జారీ చేసిందన్నారు. అయితే అస్తిత్వం కోసం, ఉనికిని చాటుకోవడానికి ఒక సంఘం తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు అందిన సంక్షేమ పథకాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్యూరి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి. మధు గౌడ్, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ ల కార్యవర్గం ఏకగ్రీవకం



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో స్థానిక ఐటిఐ ఆవరణంలో ఆదివారం రోజు పెద్దపల్లి మండల గ్రామాల ఉప సర్పంచ్ ల సమావేశం జరిగింది. సమావేశానికి హాజరై మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గుమ్మడి విజయ్ ( రాగినేడు ) అధ్యక్షులుగా తలారి స్వప్న ( అందుగులపల్లి ) ప్రధాన కార్యదర్శులుగా సిలారపు శ్రీనివాస్, ( కొత్తపల్లి )గాజుల ప్రవీణ్ కుమార్ ( కాపులపల్లి ) కొండ శ్రావణ్ కుమార్ ( రంగాపూర్ )/ఉపాధ్యక్షులుగా రాములు, అశోక్, శ్రీధర్, అనిల్, వెంకటేష్, కార్యదర్శులుగా మిట్టపల్లి వెంకటేష్, సుద్దాల స్రవంతి, ముత్యాల తిరుపతి, అశోక్, రాజేశం, కోశాధికారిగా పంబాల రాజు, సంయుక్త కార్యదర్శిగా అనూష, జయలక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులతో పాటు పలువురు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సర్పంచులతోపాటు, ఉప సర్పంచ్ లోగా గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రజాక్షేత్రంలో గెలిచి ప్రజలకు సేవ చేయాలని ఎంతో తపనతో ఎన్నికల్లో పోటీపడి విజయం సాధించామని అదే స్ఫూర్తితో ఐదేళ్లపాటు గ్రామానికి, ప్రజలకు అందుబాటు లో ఉండి ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయాలన్నారు. ప్రజల మన్ననలను పొందాలన్నారు.


## వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**వెల్దండ మండల కేంద్రంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరించడం జరిగింది.ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ పరాయి పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు దేశ స్థితిగతిని మార్చి అభివృద్ధి పథంలో నడిపించడంలో తనదైన పాత్రను పోషించింది అనేక ఒడిదుడుకులను తట్టుకొని నిలబడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో కాంగ్రెస్ పార్టీ కృషి ఎనలేనిది నేడు పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పార్టీ కోసం జెండా మోసి ముందుకు నడిపిస్తున్న నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్,మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఉపసర్పంచ్ ఎర్ర శ్రీను, వార్డు సభ్యులు, పుల్లయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు.. తాండూర్‌లో వేరువేరుగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తాండూర్ :** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తాండూర్ మండలంలో రెండు చోట్ల వేరువేరుగా నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి నేతల తీరు ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా ఉంది. ఇటీవల బెల్లంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఓ కార్యక్రమంలో పొడచూపిన గ్రూపు విభేదాల నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గ్రూపు రాజకీయాలకు అవకాశం ఇవ్వొద్దని అందరు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మండలంలోని మాదారం టౌన్ షిప్ ఐఎన్టీయూసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరగగా, తాండూరు మండల కేంద్రం ఐబీలో పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దీంతో తటస్థంగా ఉన్న కార్యకర్తలు ఏ కార్యక్రమానికి హాజరు కావాలో తెలియక అయోమయానికి గురయ్యారు.

## కేస్లాపూర్ రహదారులు అస్తవ్యస్తం

**ఇంద్రవెల్లి :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు వచ్చే భక్తులకు రహదారి కష్టాలు తప్పేలా లేవు. జనవరి 18న నాగోబా మహాపూజకు మెస్రం వంశీయులు సిద్ధం అవుతున్నారు. ఎడ్లబండి ప్రచారం నిర్వహించి ఈనెల 29ని కేస్లాపూర్ చేరుకోనుండగా.. 30వ తేదీన గంగాజలం సేకరణకు మెస్రం వంశీయులు బయలుదేరనున్నారు. మహాపూజలతోపాటు జాతర నిర్వహణ సమయం దగ్గర పడుతున్నా అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మెస్రం వంశీయుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ముత్నూర్ నుంచి కేస్లాపూర్ మీదుగా దస్నాపూర్ వరకు ఉన్న బీటీ రోడ్డు అడుగడుగున గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మార్గం నుంచి నిత్యం వందలాది మంది భక్తులతోపాటు మెస్రం వంశీయుల కుటుంబాలు, ప్రజలు ప్రయాణిస్తుంటారు. అడుగడుగున గుంతలు ఉండడంతో ప్రయాణికులు వణికిపోతున్నారు. ప్రభుత్వం రోడ్డు వెడల్పుతోపాటు మరమ్మతులకు రూ.15 కోట్లు మంజూరు చేసినా, అధికారులు ఇప్పటివరకు పనులు ప్రారంభించ లేదు. కేస్లాపూర్ నుంచి హర్కాపూర్ ఎక్స్‌రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు కంకర తెలింది. ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. నాగోబా ఆలయం నుంచి మెండపల్లి వరకు కూడా ఉన్న మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. జాతరకు వచ్చే భక్తులు, మెస్రం వంశీయులు రాకపోకలు చేస్తుంటారు. నాగోబా మహాపూజలకు సమయం దగ్గర వస్తున్న సంబంధిత శాఖల అధికారులు మాత్రం రోడ్లు మరమ్మతులపై ఇప్పటివరకు దృష్టి సారించలేదని మండల ప్రజలు, భక్తులు, మెస్రం వంశీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బాగు చేయాలని కోరుతున్నారు.

# నాలుగు రోజులుగా 114 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు

**నేటి తో ముగియనున్న కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**






**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల పట్టణ కేంద్రంలోనీ శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శంకర నేత్రాలయ చెన్నై వారిచే ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ మాడ్గుల ఇంచార్జ్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ఎనిమిది రోజులుగా సేవలు అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలోని కంటి పరీక్షలు ముగియగా, నాలుగు రోజులుగా నడుస్తున్న కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ రేపటితో ముగింపు అని తెలిపారు. ఈ శిబిరానికి మొత్తంగా. 5,200 మంది వరకు హాజరవ్వగా, 3,300 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహణ, 2,247మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ,చేయడం జరిగింది అన్నారు. 178 మంది పేషెంట్లు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక. అయ్యారని, వీరిలో 114 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రఘు,శ్రీపతి శేఖర్, నాగిళ్ళ శివ,ఎరుకలి శివ,శ్రీను,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకవర్గానికి సన్మానం చేసిన ఉప్పల వెంకటేష్



**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల్ మండలం కలకొండ గ్రామ బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి గ్రామ అధ్యక్షులు బాల రాజు గౌడ్ కార్యదర్శి సైదులు బంగారు మల్లేష్ సర్పంచ్ అభ్యర్థి డోంకి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ హైదరాబాదులోనీ వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన వార్డు సభ్యులు పల్లె నరేష్ ఆంజనేయులు నగేష్ ఇదయ్య బీఆర్ఎస్ పార్టీ గెలిచిన వాడు మెంబర్ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు వార్డు సభ్యులకు మీ వార్డులలో గ్రామ పంచాయతీ వచ్చే నిధుల నుండి ఆ వార్డులకు అభివృద్ధి పరచాలని గ్రామంలో మంచి చేయాలని ఏ కష్టంలో వచ్చిన మీకు అండగా ఉంటానని మీ కష్టంలో భాగం పంచు కుంటానని సూచనలు ఇచ్చారు కలకొండ గ్రామ నిరుపేద కుటుంబానికి డొంకి సైదులుకు ఇల్లు నిర్మాణం కోసం నా వంతుగా సహాయం చేస్తా అన్ని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, మహేష్, రాజు, రాఘవేందర్, నరసింహ, శ్రీను, కిషన్, చందర్, కిషన్, యాదగిరి, భాస్కర్, శివ, బాలు, సురేష్, చంద్రయ్య, రాజు, బక్కయ్య, గ్రామ యువకులు, పెద్దలు నాయకులు వీరితోపాటు 100 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్చాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాని కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పరాయి పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు దేశ స్థితిగతిని మార్చి అభివృద్ధి పథంలో నడిపించడంలో తనదైన పాత్రను పోషించింది అనేక ఒడిదుడుకులను తట్టుకొని నిలబడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో కాంగ్రెస్ పార్టీ కృషి ఎనలేనిది నేడు పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పార్టీ కోసం జెండా మోసి ముందుకు నడిపిస్తున్న నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్ గ్రామంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప సర్పంచ్ నంబు ఇస్తారీ**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**కల్వకుర్తి మండలం వెంకటాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాని కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప సర్పంచ్ నంబు ఇస్తారీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరాయి పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు దేశ స్థితిగతిని మార్చి అభివృద్ధి పథంలో నడిపించడంలో తనదైన పాత్రను పోషించింది అనేక ఒడిదుడుకులను తట్టుకొని నిలబడుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో కాంగ్రెస్ పార్టీ కృషి ఎనలేనిది నేడు పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం జరుపు కుంటున్న సందర్భంగా పార్టీ కోసం జెండా మోసి ముందుకు నడిపిస్తున్న నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి, వార్డు సభ్యులు నంబర్ పావని ఐలెన్ ,విజయలక్ష్మి శంకర్, ప్రవీణ్ రెడ్డి, రామస్వామి, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అగ్నిధార న్యూస్ కమన్పూర్** కమాన్పూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్ఎస్ అన్వర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు, సయ్యద్ అన్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగు సత్యనారాయణగౌడ్, ఇనగంటి భాస్కర్ రావు, కోలేటి మారుతి, వైనల రాజు, అంబిర్ శ్రీనివాస్, సదయ్య గౌడ్ తో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొనారు.....

## ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలిగిస్తే సహించేది లేదు:



**అగ్నిధార న్యూస్ కమన్పూర్** పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన మహెూన్నత పథకం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అని, గాంధీ పేరును తొలగించడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది అని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిన, గాంధీ పేరు తొలిగించినా, దేశ వ్యాప్తంగా మహెూన్నత ఉద్యమం చేపడతాం అని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, సర్పంచ్ రంగు సత్యం, నాయకులు ఇనగంటి భాస్కర్ రావు, వైనల రాజు,కోలేటి మారుతి, అంబిర్ శ్రీనివాస్, తిరుపతి గౌడ్,రాజ్ కుమార్, సదయ్య గౌడ్, జెమిని, రాజా మహేందర్, ఇక్బాల్, మల్యాల మహేష్ తో పాటు తదితరులు పాల్గొనారు...

## ఐటీ శాఖ మంత్రి నీ కలిసిన పడకల్ సర్పంచ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**శంషాబాద్ లోని కె ఎల్ సి సి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో భాగంగా స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుని మర్యాద పూర్వకంగా కలిసిన పడకల్ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన అభినందించి శాలువాతో సన్మానించడం జరిగింది.

## బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరిన వార్డు సభ్యులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలోనీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు రామస్వామి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ నుండి కాంగ్రెస్ లోకి చేరికలు జరగడం శుభపరిణామమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వెంకటాపూర్ ఉప సర్పంచ్ నంబు ఇస్తారీ,జైపాల్ రెడ్డి, సంతోష్, తది తరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండల కేంద్రంలో అఖిలభారత కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎమిరెడ్డి భగవాన్ రెడ్డి, పాల్గొని కాంగ్రెస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన పార్టీ ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. దేశంలో పేద ప్రజల అభ్యున్నతి కొరకు ఎన్నో విప్లవాత్మకమైనటు వంటి సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అమలుపరిచిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగింపు సరైన నిర్ణయం కాదు

**కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం**



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) వెల్దండ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం లో మహాత్మా గాంధీ పేరు తొలగింపు పై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు తొలగింపు సరైన నిర్ణయం కాదు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, మరియు వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## వనపర్తి సాహితీ కళావేదిక ద్వారా 'ఖాళీ కుర్చీ' పుస్తక ఆవిష్కరణ విజయవంతం

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** వనపర్తి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన 'ఖాళీ కుర్చీ' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి సాహితీ కళావేదిక సభ్యులు, సాహిత్యాభిమానులు, రచయిత మిత్రబృందానికి సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఖాళీ కుర్చీ' కవితా సంపుటి సమాజానికి ఆలోచనాత్మక సందేశాన్ని అందిస్తుందని పేర్కొంటూ, ఇలాంటి సాహిత్య కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. పుస్తక ఆవిష్కరణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలని పలుస శంకర్ గౌడ్ అన్నారు.

# లింగారావుపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

**ప్రజలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సీనియర్ నాయకులు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**తలకొండపల్లి మండలంలోని లింగ రావు పెల్లి గ్రామంలో గ్రామ ప్రజలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇంద్రమ్మ చీరల పంపిణీ గ్రామంలోని మహిళలు, పురుషులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది అన్నారు.ప్రభుత్వం అందించే ప్రతి పథకం లింగారావుపల్లి ప్రజలకు చేరేలా కృషి చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను అన్నారు.వచ్చే 5 సంవత్సరాల్లో పేదల సంక్షేమం కోసం, అర్హులకు న్యాయం చేకూర్చేందుకు, మన గ్రామా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అంకితభావంతో సేవ చేయాలని నా మనస్ఫూర్తి గా చెప్పడం జరుగుతుంది అన్నారు.గ్రామ ప్రజల అందరి సహకారం తీసుకుని గ్రామాభివృద్ధి దిశగా ముందుకు సాగుతాను అన్నారు. ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ జింకుంట్ల శ్రీనివాస్ గౌడ్, వార్డ్ సభ్యులు బొచ్చుపల్లి లక్ష్మి దేవి, శ్రీజ రాజేష్, శివలింగం ,వెల్దండ రమ్య ప్రమోద్, భాగ్యమ్మ చెన్నయ్య, జంగయ్య, బొచ్చుపల్లి శేఖర్, గ్రామ పెద్దలు నాయకులు మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొనిఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముస్త్యాల నూతన సర్పంచ్‌కు ఘన సన్మానం



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ సుంకరి మహేష్, ఉప సర్పంచ్ బాసినేని వినోద సత్యనారాయణలను వారి మిత్ర మండలి ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి మహేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ముస్త్యాల గ్రామ అభివృద్ధికి ప్రజలతో మమేకమై పనిచేస్తానని, గ్రామ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మిత్రులు షేక్ జమీల్ హుస్సేన్, కొంద్ర అంజయ్య, కాపుర బోయిన సతీష్, షేక్ గౌస్ పాషా, షేక్ యాకుబ్, షేక్ ఇంతియాజ్, షేక్ తాజుద్దీన్ బాబా పాల్గొన్నారు. అలాగే గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బేరపున్నం చందర్, సుందిల్ల రాజు, బొడ్డుపెల్లి రవి, సిద్ద శేఖర్, సుందిల్ల సతీష్‌తో పాటు పలువురు గ్రామస్తులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## రవి సుమన్‌కు ఘన సన్మానం



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం),** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం మార్కండేయ కాలనీలో నివాసముంటున్న రవి సుమన్‌ను పుర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ షార్ట్ ఫిలిం ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన స్థానిక రేడియం శ్రీనివాస్ సుపుత్రుడు రవి సుమన్ ఇటీవల పాండిచ్చేరిలోని సెంట్రల్ యూనివర్సిటీలో మాస్ మీడియా అండ్ కమ్యూనికేషన్ కోర్సులో చేరిన కొద్ది కాలంలోనే ప్రతిభను చాటుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛభారత్ షార్ట్ ఫిలిం కాంటెస్ట్‌లో పాల్గొని ఆయన రూపొందించిన లఘు చిత్రానికి అవార్డు లభించింది. ఈ అవార్డును పాండిచ్చేరి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం గోదావరిఖని ప్రజలకు గర్వకారణంగా నిలిచిందని, ఇది యువ కళాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. రవి సుమన్‌ను అభినందిస్తూ జరిగిన సన్మాన కార్యక్రమంలో నిర్మతల మండలి పెద్దపల్లి శాఖ అధ్యక్షుడు కొమ్మ కుమార్ యాదవ్, కళాతోరణం ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ అమేజింగ్ స్టార్ అశోక్ వేముల, సీనియర్ కళాకారులు దామెర శంకర్, గాంధీగిరి వార్తల చైర్మన్ దయానంద్ గాంధీ, కార్మిక నాయకుడు సిహెచ్ ఉపేందర్ పాల్గొన్నారు.అలాగే డైరెక్టర్లు గొట్టే మహేష్, నగునూరి విజయ్, సంపత్ ఊదరి, బి ఎన్ క్రియేషన్ అధినేత బడికిల గణేష్, కళాకారిణి జక్కిని శ్రీలత, మేకల శ్రీకాంత్, డాక్టర్ జెవీ రాజు (న్యూ ఇండియా పార్టీ), సీనియర్ కళాకారులు వాసు, కుమార్, లక్ష్మణ్, అంజన్న, దామెర రాజేష్, రేడియం శ్రీనివాస్, వి6 శంకర్, ఉపాధ్యాయులు సతీష్‌తో పాటు పలువురు కళాకారులు, ప్రొడ్యూసర్లు పాల్గొని రవి సుమన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ట్రస్టు చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన పల్చ లక్ష్మయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడ్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 రూపాయలు రూపాయలు మరియు గ్రామ సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడ్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు 5000 రూపాయలు మొత్తం 8000 రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు వెంకటయ్య, మల్లేష్, నాయకులు కొప్పు కృష్ణయ్య ఆర్కేగౌడ్, పరమేష్ గౌడ్, కుమార్, అడిమయ్య, జహంగీర్, గిరి, మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## సెల్యూట్ పోలీసన్న విధుల్లో మానవత్వం.

-ప్రమాద స్థలంలో మానవీయ స్పందన.

-ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రాణరక్షణలో ముందు.



**అగ్నిధార గోదావరిఖని టౌన్ డిసెంబర్ 28** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్, గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన సమయంలో అక్కడే ఉన్న రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు వెంటనే స్పందించి గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే ప్రమాదానికి కారణమైన కారును, డ్రైవర్‌ను గోదావరిఖని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. విధుల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మానవత్వాన్ని చాటుతూ ఇన్‌స్పెక్టర్ చూపిన చొరవను స్థానికులు అభినందించారు.ఈ ఘటనతో ట్రాఫిక్ పోలీసులు ప్రజల భద్రతతో పాటు ప్రాణరక్షణలోనూ ముందుంటారనే నమ్మకం ప్రజల్లో మరింత బలపడిందని వారు పేర్కొన్నారు.

## 46వ డివిజన్‌లో దోమల నివారణకు పొగమందు కార్యక్రమం



**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు నిర్వహణ**

**అగ్ని ధార న్యూస్ (రామగుండం):** రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు 46వ డివిజన్‌లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. 46వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మేకల పోశం యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓర్సు అనిల్ ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం పొగమందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ ముస్కు చంద్రమొగిలి పాల్గొని, పరిసర ప్రాంతాల్లో దోమల నియంత్రణకు ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలానంతరం డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రజలు కూడా శుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## శౌర్య విజయ్ దివస్ వేడుకలను జయప్రదం చేయండి

**సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా, మార్షల్ దుర్గం నగేష్**



**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):** జనవరి 1 న హైదరాబాదులో నిర్వహించనున్న భీమా కోరేగావ్ శౌర్య విజయ్ దివస్ వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంబేద్కరిస్టులు, బుద్ధిస్టులు, మేధావులు, విద్యార్థులు మరియు అభ్యుదయ భావజాలం కలిగిన ప్రతి ఒక్కరూ ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ పిలుపునిచ్చారు,

**కార్యక్రమ వివరాలు:**

**మార్చ్ పాస్ట్:** ఉదయం 10:30 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తి భవన్ నుండి లోయర్ ట్యాంక్ బండ్ వరకు సమతా సైనిక దళ్ సైనికులచే కవాతు నిర్వహించబడుతుంది. అనంతరం 11:45 గంటలకు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి గౌరవ వందనం సమర్పిస్తారు.

**జాతీయ సెమినార్:**

మధ్యాహ్నం 2:30 గంటలకు లక్డీకాపూల్‌లోని ప్రబుద్ధ భారత్ భవనంలో "నేషనాలిటీ – ఇండియన్స్ (భారత్ రాష్ట్ర నిర్మాణం)" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించబడుతుంది.

**అవార్డుల ప్రదానం:**

సాయంత్రం 4:30 గంటలకు సమాజ సేవలో విశేష కృషి చేసిన వారికి "దేవనామ్ ప్రియదర్శిని సామ్రాట్ అశోక్" అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. బాబాసాహెబ్ ఆశయాలను, భీమా కోరేగావ్ వీరుల పోరాట పటిమను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ నీలి సైనికులై కదలాలని డాక్టర్ నగేష్ కోరారు.

## కొత్త వాళ్లతో కొత్త సినిమా

**టాలెంట్ ఎవరి సొత్తు కాదు: దర్శకుడు అజర్**



**అగ్నిధార న్యూస్,(రామగుండం):** కొత్త ప్రతిభకు వేదికగా నిలుస్తూ రూపొందిన 'కొత్త సినిమా' ప్రేక్షకుల ఆదరణ పొందుతోందని చిత్ర బృందం పేర్కొంది. గోదావరిఖనిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సినిమా యూనిట్ పాల్గొని ప్రేక్షకులను కలిసింది. ఈ సందర్భంగా దర్శకుడు అజర్ మాట్లాడుతూ.. సినిమా రంగంలో టాలెంట్ ఎవరి సొత్తు కాదని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయని అన్నారు. కొత్తవాళ్లతో, కొత్త ఆలోచనలతో రూపొందిన ఈ చిత్రం సమాజానికి సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు, కళాకారులు మాట్లాడుతూ.. చిన్న సినిమాలకు ప్రేక్షకుల మద్దతు అవసరమని, అలాంటి చిత్రాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజానిదేనని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, చిత్ర బృంద సభ్యులు, యువకులు, సినీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు. కొత్త ప్రయత్నాలకు అగ్నిధార దినపత్రిక ఎల్లవేళలా అండగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మంత్రి



**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్),:** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే విలువలతో 141 సంవత్సరాలుగా దేశానికి సేవలందిస్తున్న పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు జిల్లెల్ల రాములు**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన తోటపల్లి బాలమణి అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు జిల్లెల్ల రాములు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలుపుతూ 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి రవి గౌడ్, ఉప సర్పంచ్ ఎముక రవి, వార్డు సభ్యులు గుమ్మకొండ నాగమణి మహేంద్రం, డొక్కా చెన్నమ్మ జంగయ్య,హనుమాన్ దేవాలయ వైస్ చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ మెంబర్ నాప మల్లయ్య,మాజీ కొ ఆప్షన్ మెంబర్ గుమ్మకొండ బాల్ జంగయ్య, తది తరులు పాల్గొన్నారు.

# దేశంలో పేద ప్రజల గొంతుక సిపిఐ

**– శ్రీరామ్**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** దేశంలోని పేద ప్రజల గొంతుక సిపిఐ అని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి 1925 , డిసెంబర్ 26 కు వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో పానుగల్ మండలం కేతేపల్లిలో శతజయంతి వారోత్సవాలను నిర్వహించారు. గ్రామపంచాయతీ వద్ద సిపిఐ జెండాను సీనియర్ నేత కమ్మావుల పెంటయ్య ఆవిష్కరించగా శ్రీరామ్ మాట్లాడుతూ.. శ్రమజీవుల కష్టాలను కడగళ్లను చట్టసభల్లో ప్రజా పోరాటాల్లో వినిపించి పరిష్కారం సాధించిందన్నారు. ప్రతి క్షణం పేదవాడి రక్షణ అభివృద్ధే ధ్యేయంగా సిపిఐ పనిచేస్తోందన్నారు. 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ కాన్పూర్ లో ఆవిర్భవించిన సిపిఐ స్వాతంత్ర సమరంలో దూకి, సంపూర్ణ స్వాతంత్రం ఇవ్వాలని తొలిసారిగా పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. వందేళ్ళ ప్రయాణంలోకార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల కు అనుకూల చట్టాల నుపోరాడి సాధించిందన్నారు. కష్టమొచ్చినా అన్యాయం జరిగినా పేదలకు మొదట కనిపించేది ఎర్రజెండా సిపిఐ మాత్రమే అన్నారు. దున్నే వాడికి భూమి, గూడు లేని వారికి నీడ అప్పుల్లో ఉన్న వారికి పోరాటాల ద్వారా రుణ విముక్తి కలిగించిందన్నారు.ఆకలితో అలమటిస్తున్న గ్రామీణకూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని సిపిఐ కల్పించిందన్నారు. బిజెపి ఈ పథకం పేరు మార్చి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని తిప్పి కొట్టాలన్నారు. నైజాం నవాబు ఉక్కు పాదాల కింద తెలంగాణ నలిగిపోతున్న తెలంగాణలో సాయుధరైతాంగ పోరాటం సాగించిందని,4500 మంది పోరాటంలో అమరులయ్యారన్నారు. బాంచన్ నీకాల్మొక్త అనే సామాన్యులచే బంధూకులు పట్టించి దొరలు భూస్వాములను తరిమి కొట్టిందన్నారు. దొరల పీడన నుంచి 3000 గ్రామాలను దొరల నుంచి విముక్తం చేసి ఎర్రజెండాలు పాతిన మొనగాడు సిపిఐ అన్నారు. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిందన్నారు. దేశంలో బిజెపి మతత్వాన్ని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని, సంపన్నులు అనుకూల పేదల వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.హామీలను విస్మరించి, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కావటం లేదన్నారు. ఉపేక్షిస్తే ప్రజలతో తిరస్కరణ తప్పదు అన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని, ప్రజలు ఎర్రజెండా కింద సంఘటితమై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కేతేపల్లి గ్రామ ఉపసర్పంచ్ కృష్ణవేణి,సిపిఐ మండల కార్యదర్శి డంగు కురుమయ్య, మాజీ వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ పెంటయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కాకం చిన్న నారాయణ, నేతలు కాకం కాశన్న, పరశురాముడు, సంతోష్, రామాంజనేయులు,ఎలగొడ్డు రాముడు, నరసింహ, బోయ చిన్న కురుమయ్య, వెంకటమ్మ, శంకరమ్మ, అంజనమ్మ, దేవమ్మ, బాలపీరమ్మ, ఎల్లమ్మ, దొడ్ల బీరయ్య, ఎజ్జు బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ 141వ ఆవిర్భావ వేడుకలు

## గాంధీ పేరును తొలగించడంపై నిరసన



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని గోదావరిఖని టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శివాజీనగర్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రధాన కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ బొంతల రాజేష్ హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మా గాంధీ పేరును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీతో పాటు అనుబంధ సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గోదావరిఖని ప్రధాన చౌరస్తా గణేష్ చౌక్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహానికి చేరుకుని పూలమాలలు వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, గట్ల రమేష్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఉదయ్‌రాజ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపి, ప్రజలను సంఘటితం చేసి, పరాయి పాలకులను దేశం విడిచి వెళ్లేలా చేసిన ఘన చరిత్ర కలిగిన పార్టీ అని తెలిపారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్సేనని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానంతరం విద్య, వైద్యం, పరిశ్రమలు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ రంగాలు సహా అన్ని రంగాల్లో దేశాభివృద్ధికి పునాది వేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం రాజీ లేని విధానాలతో పనిచేసి, చివరకు దేశద్రోహుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను దేశ ప్రజలు ఎప్పటికీ మరచిపోరని పేర్కొన్నారు. అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన చరిత్రను దేశం మరిచిపోలేదని, నేడు కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం గాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం మరో రకమైన దాడిగా అభివర్ణించారు. ఈ చర్య దుర్మార్గమని, దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకుని, పేదలకు ఉపాధి భద్రత కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మహాత్మా గాంధీ పేరుతోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముస్తఫా, సుతారి లక్ష్మన్‌బాబు, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, చుక్కల శ్రీనివాస్, ఉమా సాంబమూర్తి, దూళికట్ట సతీష్, కొమ్ము వేణు, ఎండీ యాకుబ్, పంజా శ్రీనివాస్, శోభ, స్వప్న, శాంతి, నజీముద్దీన్, మేకల పోషం, ఉల్లంగుల రమేష్, దశార్థం, గడ్డం శ్రీనివాస్, అశోక్, కుంట సాది, బర్ల స్వామి, పీక అరుణ్‌కుమార్, హమీద్, కూడుదల శివ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి భవన్‌లో ఐఎన్‌టీయూసీ మీటింగ్ దుర్మార్గం

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

**: ఏఐటీయూసీ**



**అగ్నిదార న్యూస్ రామగుండం):** సింగరేణి భవన్‌లో ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యకర్తల సమావేశం నిర్వహించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, ఇది సింగరేణి సంస్థకూ, కార్మిక వర్గానికీ తీవ్ర అవమానమని ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. ఐఎన్‌టీయూసీ సమావేశానికి సింగరేణి భవన్‌ను అనుమతించిన అధికారులపై యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం డిమాండ్ చేశారు.ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ 135 సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఏ యూనియన్ కూడా సింగరేణి భవన్‌లో సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ అండ చూసుకుని ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్ సింగరేణి భవన్‌ను అక్రమంగా వాడుకోవడం తీవ్రంగా ఖండనీయమని తెలిపారు.కార్మికుల సమస్యలపై సమీక్ష పేరుతో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ సమావేశంలో జనక్ ప్రసాద్ సి ఎండి కుర్చీలో కూర్చుని సమావేశం నిర్వహించడం అధికార అహంకారానికి నిదర్శనమని, ఇది సింగరేణి సంస్థను, కార్మికులను, సి ఎండీ హోదాను అగౌరవపరిచిన చర్యగా అభివర్ణించారు. ఈ వ్యవహారంపై కార్మిక వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉందని తెలిపారు.ఐఎన్‌టీయూసీ సమావేశానికి సింగరేణి భవన్‌ను అనుమతించిన అధికారులపై యాజమాన్యం తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాలని వారు డిమాండ్ చేశారు.అదేవిధంగా డిసెంబర్ 26న సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంపై డైరెక్టర్ (పా)తో చర్చలు జరిగాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు క్వార్టర్ ఖాళీతో సంబంధం లేకుండా 34 శాతం లాభాల్లో వాటా, దీపావళి బోనస్ చెల్లించేందుకు అంగీకారం లభించిందని, మైనింగ్ స్టాఫ్‌కు అన్‌ఫిట్ అయిన వారికి సూటబుల్ ఉద్యోగాలు కల్పించేందుకు యాజమాన్యం ఒప్పుకుందని చెప్పారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల విధులకు హాజరైన సింగరేణి ఉద్యోగులకు ఓ.డి ఇవ్వడానికి కూడా అంగీకరించారని తెలిపారు.మిగిలిన కార్మిక సమస్యలపై జనవరిలో జరిగే స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందని పేర్కొన్నారు. 2026 నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా సింగరేణి కార్మిక వర్గానికి ఏఐటీయూసీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, అర్జీ 1 బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఉపాధ్యక్షులు మాదన మహేష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, నాయకులు బోగ సతీష్‌బాబు, దొంత సాయన్న, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, బలుసు రవి, చెప్యాల భాస్కర్, నాయిని శంకర్, గుర్రం ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాల మేరకు పెద్దపల్లిలో పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బూషనవేణ సురేష్ గౌడ్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ గౌడ్, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్రత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో కాంగ్రెస్ నాయకులు ప్రాణాలర్పించారని అన్నారు. దేశంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి పేదలకు అండగా నిలిచింది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ నాయకత్వంలో సర్పంచ్ ఎన్నికల్లో ఆదరించిన విధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంకూరి అవినాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్, నాయకులు భూతగడ్డ సంపత్, నెత్తెట్ల కుమార్ యాదవ్, తాడూరు శ్రీమాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, బండారి సునీల్ గౌడ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నాంసాని శ్రీనివాస్, తిరుమలేష్, భూపేంద్ర ఫణి, గంగుల రాకేష్, వెంకటేష్, రవి, అమిరిశెట్టి సతీష్, నదీమ్, మసూద్, హకీం, మేడగాని శ్రీనివాస్ గౌడ్, సంతోష్, దేవరకొండ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం పటిష్టతకు కృషి చేయండి

**–జిల్లా అధ్యక్షులు కందుల సదాశివ్**




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి,డిసెంబర్** బీసీ సంక్షేమ సంఘం పటిష్టత,బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్క బీసీ నాయకుడు కృషి చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కందుల సదాశివ్ కోరారు.ఆదివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు కందుల సదాశివ్ ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా కాసగోని నిర్మలాదేవి గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా జునుగారి సుధాకర్,జిల్లా యూత్ ప్రెసిడెంట్ గా తమ్మెడబోయిన రాజ్ కుమార్ యాదవ్ లను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సదాశివ్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కార్యవర్గ సభ్యులు బీసీల హక్కులు, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని,సంఘాన్ని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.బీసీల సమస్యల పరిష్కారానికి సంఘం ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సిరవేన స్వప్న,ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ పటేల్, సలహాదారులు డాక్టర్ మంద భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొని నూతనంగా నియమితులైన నాయకులు బీసీల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని సూచించారు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ డిసెంబర్: 28** గోదావరిఖని 34 డివిజన్లో మాజీ కార్పొరేటర్ బొబ్బలి ఆధ్వర్యంలో ఆదివారం నూతన క్యాలెండర్ ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా తెరాస నాయకులు వాళ్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెరాసపాలెంలోనే అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కెసిఆర్ అయామ్ లోనే అభివృద్ధి కార్యక్రమాలు ప్రాజెక్టులు గుర్తుచేసిన ఘనత ఉందన్నారు. అనంతరం 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమం లో స్థానికులు మహిళలు పాల్గొన్నారు

## పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



**నార్నూర్ :** పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లోని జాతీయ సేవా పథకం వాలంటరీలు మహాగావ్ పంచాయతీ పరిధిలోని శేకుగూడ గ్రామం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతంలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం శీతాకాలం శిబిరంలో భాగంగా వారం రోజులపాటు శేకుగూడ గ్రామంలో రోజువారి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానికుల సహకారంతో వాలంటరీల ద్వారా పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం భీంభాయి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట కేశవులు, అధ్యాపకులు వెంకటరమణ, జలంధర్, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు ఉన్నారు.



# అఖిల్ 'లెనిన్'పై కీలక అప్‌డేట్.. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్?

అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'లెనిన్' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వినరో భాగ్యం విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశీ, అక్కినేని నాగార్జున సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తోనే అఖిల్ ఈ సినిమాలో విభిన్నమైన మాస్ పాత్రలో కనిపించబోతున్నాడని క్లారిటీ ఇచ్చారు మేకర్స్. అయితే ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో షూటింగ్ స్టేటస్, రిలీజ్ టైమ్‌లైన్‌పై అభిమానుల్లో సందేహాలు నెలకొన్నాయి. సోషల్ మీడియాలోనూ ఏదొక అప్‌డేట్ ఇవ్వాలని అక్కినేని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాత నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. అడగకుండానే మాట్లాడిన ఆయన, మరికొద్ది రోజుల్లోనే 'లెనిన్' ఫస్ట్ సింగిల్ విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని తెలిపారు. అంతేకాదు, సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని, వచ్చే ఏడాది మార్చిలో మూవీని విడుదల చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.నాగవంశీ వ్యాఖ్యలతో అక్కినేని అభిమానుల్లో జోష్ పెరిగిపోయింది. నిర్మాత మాటల్ని బట్టి చూస్తే అఖిల్ కెరీర్‌లో ఇదే ఫస్ట్ బ్లాక్‌బస్టర్ అవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. న్యూ ఇయర్ కానుకగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేస్తారని అంచనాలు వినిపిస్తున్నాయి. మరి ఈ రెండు మూడు రోజుల్లో 'లెనిన్'కు సంబంధించిన అధికారిక ప్రకటన వస్తుందా? అఖిల్ నుంచి మాస్ సర్ప్రైజ్ ఎప్పుడు వస్తుందో చూడాలి. కాగా, అఖిల్ కెరియర్‌లో ఇప్పటి వరకు మంచి హిట్ ఒక్కటి లేదు. పెళ్లి తర్వాత అఖిల్ నుండి వస్తున్న తొలి చిత్రం ఇదే కాగా, ఈ మూవీతో మనోడు మంచి హిట్ దక్కించుకుంటాడా, అక్కినేని ఫ్యాన్స్‌కి న్యూ ఇయర్‌లో మంచి ట్రీట్ ఇస్తాడా అనేది చూడాలి.

# అద్భుతమైన కంటెంట్‌తో 'ఓ అందాల రాక్షసి' స్టోరీ




దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా తెరకెక్కించిన ఈ మూవీ జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. షెరాజ్ మెహదీ మాట్లాడుతూ .. "ఓ అందాల రాక్షసి' మూవీని జనవరి 2న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాను. కొత్త ఏడాదిలో ఓ మంచి సినిమా వస్తుంది. ఈ మూవీలో కృతి వర్మ, విహాన్షి హెగ్డే, నేహ దేశ్ పాండే, అఖిల, గీతా రెడ్డి, స్నేహ, ప్రియా దేశ్ పాల్, సుమన్ గారు, తమ్మారెడ్డి భరద్వాజ్ ఇలా చాలా మంది అద్భుతమైన పాత్రల్ని పోషించారు. మంచి కంటెంట్‌తో రాబోతోన్న ఈ సినిమా ఆడియెన్స్‌కి ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టదు. సందేశాత్మక కథతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇందులోని ట్విస్ట్‌లు అద్భుతంగా ఉంటాయి. అమ్మాయిలకు నచ్చే చిత్రం అవుతుంది' అని అన్నారు. కథ, మాటల రచయిత భాష్య శ్రీ మాట్లాడుతూ .. "ఓ అందాల రాక్షసి' సినిమాకు కథను, మాటల్ని రాశాను. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఓ మంచి ఫీల్‌తో బయటకు వస్తారు. నేటి తరం ఆడపిల్లలు ఎలా ఉండాలనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని చేశాం. మా హీరో షెరాజ్ అద్భుతంగా నటించారు. డైరెక్టర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా, హీరోగా ఇందులో మ్యాజిక్ చేశారు. కృతి వర్మ హిందీలో చాలా ఫేమస్. విహాన్షి చాలా అద్భుతంగా నటించారు. ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది. జనవరి 2న ఈ మూవీని అందరూ చూడండి' అని అన్నారు.



# యశ్ టాక్సిక్‌లో మరో హాట్ బ్యూటీ.. ఎలిజబెత్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్

'రాకింగ్ స్టార్' యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో చాలా మంది ఆర్టిస్టులు నటిస్తున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా రోజులు మిగిలి ఉంది. అయితే ప్రమోషన్లు మాత్రం విస్తృతంగా చేస్తున్నారు. ఈ సినిమాలోని నటీనటుల పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తున్నారు. యష్ తో పాటు , ఈ సినిమాలో చాలా మంది ప్రముఖ ఆర్టిస్టులు నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి తదితర స్టార్స్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో భాగం కానున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి హుమా ఖురేషి పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. 'టాక్సిక్' సినిమాలో ఎలిజబెత్ పాత్రలో హుమా ఖురేషి నటిస్తోంది. పేరుకు తగ్గట్టుగానే ఈ పాత్ర చాలా రిచ్ గా ఉంది. గ్లామరస్ డ్రెస్ వేసుకుని రెట్రో లగ్జరీ కారు ముందు నిలబడి ఉన్న హుమా ఖురేషి లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది చూసిన తర్వాత ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.


'టాక్సిక్' సినిమాను కన్నడ, ఇంగ్లీషు భాషల్లో ఒకేసారి నిర్మిస్తున్నారు. దీనిని ఇతర భాషల్లోకి డబ్ చేస్తున్నారు. 'కె.వి.ఎన్. ప్రొడక్షన్స్' ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. యష్, నయనతార, కియారా అద్వానీ, అక్షయ్ ఒబెరాయ్, తారా సుతారియా, టోవినో థామస్, రుక్మిణి వసంత్ తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం నటి కియారా అద్వానీ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ సినిమాలో ఆమె నదియా పాత్రను పోషిస్తోంది. గీతు మోహన్‌దాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'కేజీఎఫ్: చాప్టర్ 2' తర్వాత యష్ అంగీకరించిన సినిమా ఇది కాబట్టి, 'టాక్సిక్' పై చాలా అంచనాలు ఉన్నాయి.





# మన శంకర వరప్రసాద్ గారు నుండి స్పెషల్ పోస్టర్..

సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి స్పీడ్ మరింత పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్లను దూకుడు పెంచింది. తాజాగా మూవీ రిలీజ్‌కి కేవలం 15 రోజుల సమయం మాత్రమే ఉందని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. ఇందులో చిరు కొబ్బరి బోండం తాగుతూ స్టైలిష్ లుక్‌లో కనిపించారు. ఈ పోస్టర్ మెగా ఫ్యాన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. చిరు ఫ్యాన్స్ ఈ పోస్టర్‌ని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే అమెరికాలో ఈ సినిమా బుకింగ్స్ అధికారికంగా ఓపెన్ చేసినట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఈ చిత్రానికి సంబంధించిన యూఎస్ ప్రీమియర్స్ జనవరి 11న అత్యంత గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. సంక్రాంతి పండుగకు ముందే బాక్సాఫీస్ బజ్ స్టార్ట్ కావాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ ప్లాన్ చేశారు. పండగ మూడ్‌ను సెట్ చేసేలా ప్రీమియర్స్‌ను డిజైన్ చేయడంతో ఓవర్సీస్‌లో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ సరిగామ సినిమాస్ ఈ చిత్రాన్ని విదేశాల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేస్తోంది. . అనిల్ రావిపూడి మార్క్ కామెడీకి చిరంజీవి మాస్ ఇమేజ్, కామెడీ టైమింగ్ కలిస్తే వచ్చే ఎంటర్‌టైన్‌మెంట్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ కావడంతో ఈ సినిమాపై బజ్ మామూలుగా లేదు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ఇప్పటికే మాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఇప్పుడు ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ కావడంతో రికార్డుల వేట మొదలైనట్లే అని అభిమానులు భావిస్తున్నారు. జనవరి 11న ప్రీమియర్స్‌తోనే సినిమా రేంజ్ ఏంటో తేలిపోతుందని ట్రేడ్ విశ్లేషకులు అంటున్నారు.

# నా కులం చూసి హీరోగా తీసేశారు : రవికృష్ణ



సీరియల్ నుంచి సినిమాల్లోకి వచ్చిన నటుడు రవికృష్ణ. మొగలిరేకులు సీరియల్‌తో బుల్లితెరకు పరిచమైన రవికి బిగ్‌బాస్ షోతో మరింత గుర్తింపు వచ్చింది. షో నుంచి బయటకు వచ్చిన తర్వాత సినిమా చాన్స్‌లు వచ్చాయి. విరూపాక్ష సినిమా రవి కెరీర్‌ని మలుపు తిప్పింది. ఆ తర్వాత రవి వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు. ఇటీవల విడుదలైన దండోరాలో కీలక పాత్ర పోషించాడు. కులం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రవి..తక్కువ కులానికి చెందిన యువకుడిగా నటించాడు. అగ్ర కులానికి చెందిన అమ్మాయితో ప్రేమలో పడి.. ఆమె కులం వాళ్ల చేతిలో హత్యకు గురవుతాడు. సినిమా ప్రేక్షకులు రవి నటనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఇలాంటి పాత్రల్లో నటించే అవకాశం కోసం చాలా కష్టపడాల్సి వచ్చిందంటున్నారు రవి. దండోరా సినిమాలో మాదిరే తాను కూడా కుల వివక్షకు గురయ్యాడట. తన కులం చూసి సినిమా చాన్స్‌లు ఇవ్వలేదట. తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో? రవి తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఇబ్బందుల గురించి వివరించాడు. 'మాది విజయవాడ. మిడిల్ క్లాస్ ఫ్యామిలీ నుంచి వచ్చాను. నా కంటే ముందు మా ఫ్యామిలీ నుంచి ఒక్కరు కూడా ఇండస్ట్రీలోకి రాలేదు. నాకు సినిమాలంటే పిచ్చి. కానీ ఇండస్ట్రీ ఎక్కడ ఉంటుందో కూడా తెలియదు. ఇంటర్ పూర్తయ్యాక సినిమాల్లోకి వెళతా అంటే..ఇంట్లో తిట్టారు. దీంతో డిగ్రీ చేసి.. సినిమాల్లోకి వచ్చాడు. సినిమా ఇండస్ట్రీ హైదరాబాద్‌లో ఉంటుందని తెలియక..చెన్నై వెళ్లాను. అక్కడ ఓ సీరియల్‌కి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశా. కొన్నాళ్ల తర్వాత వాళ్లే ఓ తెలుగు సీరియల్ చేస్తే..అందులో నటించాడు. అది మూడు నెలలకే ఆగిపోయింది. ఆ తర్వాత తెలుగు ఇండస్ట్రీ హైదరాబాద్‌లో ఉంటుందని తెలుసుకొని.. ఇక్కడకు వచ్చాడు. మా మేనత్త వాళ్ల ఇంట్లో ఉంటూ.. అవకాశాల కోసం తిరిగాను.




# డీసెంట్ టాక్‌తో దూసుకెళ్తున్న 'ఛాంపియన్' 10 కోట్ల దిశగా స్పోర్ట్స్ డ్రామా

యంగ్ హీరో రోషన్ మేక హీరోగా నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్' బాక్సాఫీస్ వద్ద నిలకడగా పరుగులు పెడుతోంది. విడుదలైన మొదటి రోజు మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ తర్వాత వర్డ్ ఆఫ్ మౌత్‌తో కలెక్షన్లు మెరుగుపడ్డాయి. మూడు రోజుల్లోనూ డీసెంట్ వసూళ్లు సాధిస్తూ సినిమాపై మంచి బజ్ కొనసాగుతోంది. మూవీ టీం వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఛాంపియన్' చిత్రం మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.8.89 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ సందర్భంగా "ఛాంపియన్ థియేటర్లలో అదే జోష్ కొనసాగిస్తోంది" అంటూ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.4.50 కోట్లు, రెండో రోజు రూ.2.40 కోట్లు రాబట్టిన సినిమా, మూడో రోజు కూడా అదే స్థాయిలో కలెక్షన్లు నమోదు చేసింది. వీకెండ్ ముగిసేలోగా లేదా సోమవారం నాటికి రూ.10 కోట్ల మార్క్ దాటే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో రోషన్ సరసన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించగా, వీరిద్దరికీ ఇదే తొలి సినిమా కావడం విశేషం. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో, ఒకప్పటి హీరో నందమూరి కల్యాణ్ చక్రవర్తి 'రాజి రెడ్డి' పాత్రలో ఆకట్టుకున్నారు. అలాగే అర్చన, కోవై సరళ, వెన్నెల కిశోర్, నరేష్, ప్రకాష్ రాజ్, రచ్చ రవి, హైపర్ ఆది, సంతోష్ ప్రతాప్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించారు. జీ స్టూడియోస్ సమర్పణలో, స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిం బ్యానర్లపై ఈ సినిమాను నిర్మించారు. నిర్మాతగా స్వప్న దత్ వ్యవహరించారు. సంగీతం మిక్కీ జే మేయర్ అందించగా, ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు మంచి స్పందన వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో ప్రజలు భయంతో బతుకుతున్న కాలం నేపథ్యంలో కథ నడుస్తుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com